
సాక్షి
గుంటూరు

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



వీరుల గుడికి వీరాచారులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉన్న పల్నాటి వీరుల గుడికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం వీరాచారులు తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 538.50 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 10,000 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తేజోరూపిణిగా బగళాముఖి



చందోలు(కర్లపాలెం): గ్రామంలో వేంచేసి యున్న బగళాముఖి అమ్మవారు ఆదివారం భక్తులకు తేజోరూపిణిగా దర్శనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మాఘ మాస అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సూర్య భగవానునికి 241 పాత్రలతో పాయసం నివేదన



మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేదిక ప్రాంగణంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సూర్య భగవానుడికి వాసవీ క్లబ్, వాసవీ పరివార్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహిళా సభ విభాగాల ఆధ్వర్యంలో 241 పాత్రలతో పాయసంతో సూర్య భగవానుడికి నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఆవు పాలు, పిడకలతో ఏక కాలంలో శ్రీ సూర్యనారాయణస్వామికి పాయసం వండి నివేదించడం ఎంతో శుభప్రదమని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి ఎంతోమంది మహిళలు పాల్గొన్నారని నిర్వాహకులు తెలియజేశారు. సూర్య భగవానుడికి ఇష్టమైన రోజు ఆదివారమని, ఆ రోజున తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆర్గనైజర్, కో–ఆర్డినేటర్ సుజాత, రామకృష్ణ పాల్గొన్నారు.

'రాష్ట్ర సమ్మాన్' పురస్కారం ప్రదానం




తెనాలి: తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో సంస్కృతి కళాక్షేత్ర ఇంటర్నేషనల్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని జీపీ బిర్లా సైన్స్ ఆడిటోరియంలో జరిగిన భారత్ ఉత్సవ్–2025లో తెనాలికి చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్ నారాయణకు 'రాష్ట్ర సమ్మాన్' అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కళా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు హాజరై చిన్నారిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఘనతలు సాధించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏడాదిన్నర వయసు నుంచే అద్భుత జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్న ప్రదీప్‌నారాయణ మూడేళ్ల వయసులో జాతీయ గీతాన్ని 52 సెకన్లలో ఆలపిస్తున్నాడు. పండ్లు, కూరగాయలు, మనిషి శరీర భాగాలు వంటివి 500 పైగా గుర్తిస్తున్నాడు. తెలంగాణ 'రాష్ట్ర సమ్మాన్' సహా ఇప్పటికి ఎనిమిది జాతీయ పురస్కారాలు, అంతర్జాతీయ స్థాయిలో పది అవార్డులు అందుకున్నాడు.

కస్టమ్స్ అధికారులు అవయవదానం



లక్ష్మీపురం: కస్టమ్స్ డే వేడుకలలో భాగంగా కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి దంపతులు అవయవదానం చేశారు. విజయవాడలో శనివారం నిర్వహించిన వేడులలో ఆయన మాట్లాడుతూ బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ స్థాపకులు ఒకే రోజు 4 వేల మందితో రక్తదానం చేయించారని అభినందించారు. ప్రతిఒక్కరు సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలన్నారు. తాను, తన సతీమణి అవయవదానం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రాంగణంలో ఉన్న కస్టమ్స్ శాఖ అధికారులు 36 మంది కూడా అవయవదానం చేస్తూ అంగీకారపత్రం ఇచ్చారు. సెప్టెక్ చైర్‌పర్సన్ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ ఇంతమంది అవయవదాతలుగా నమోదు కావడం సంతోషకరంగా ఉందన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ నీరాజనం ఆదివారంతో ముగిసింది. డీవీర్ సీత గాత్ర కచేరీని త్యాగరాజ కీర్తన, నిన్నే భజన అనే కీర్తనతో ప్రారంభించారు. పలు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. ఆమెకు వాయులీనంపై వారణాసి శ్రీకృష్ణ రాఘవ, మృదంగంపై బి.సురేష్‌బాబు వాయిద్య సహకారాన్ని అందించారు. కళాకారులను ఎం.వై.శేషురాణి, ప్రముఖ సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు, నేతి విశ్వేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కన్వీనర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

జీబీ సిండ్రోమ్ కలకలం

- గుంటూరు జీజీహెచ్‌లో బాధితురాలి మృతి
- ప్రతినెలా సగటున 10 నుంచి 15 మందికి చికిత్స
- సత్వర వైద్యసేవలు అందిస్తుండటమే కారణం
- భయపడాల్సిన పనిలేదంటున్న వైద్య నిపుణులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో జీబీ సిండ్రోమ్ (గులియన్‌బెరి సిండ్రోమ్) కలకలం రేపుతోంది. తాజాగా గుంటూరు జీజీహెచ్‌లో ఆదివారం ప్రకాశం జిల్లా అలసానిపల్లెకు చెందిన బి.కమలమ్మ(45) చికిత్స పొందుతూ మృతి చెందింది. జీబీ సిండ్రోమ్‌తో ఈ నెల 3న జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో అడ్మిట్ అయి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆదివారం కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయింది. వాస్తవానికి ప్రతినెలా గుంటూరు జీజీహెచ్‌లో పది మంది నుంచి పదిహేను మంది ఈ వ్యాధి బాధితులు చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన వారు గుంటూరు జీజీహెచ్‌కు తరలి వస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జీజీహెచ్‌లో జీబీ సిండ్రోమ్ కేసులకు న్యూరాలజీ వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. ఖరీదైన ఇంజక్షన్‌లను తక్షణమే ఇస్తున్నట్లు న్యూరాలజీ వైద్యులు తెలిపారు.

భయపడాల్సిన పనిలేదు...

ఆదివారం చోటు చేసుకున్నది తొలి మరణమేమీ కాదని... గత ఏడాది కాలంలో ఈ ఆస్పత్రిలోనే నలుగురు వ్యాధి బాధితులు మృతి చెందినట్లు చెబుతున్నారు. ఖరీదైన వైద్యం అవసరమేగానీ, వ్యాధికి భయపడాల్సిన పని లేదని వైద్యులు పేర్కొన్నారు. లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఆదివారం కమలమ్మ మృతి చెందింది. కాగా, నరసరావుపేటకు చెందిన మరో మహిళ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురిలో ఇద్దరు గుంటూరు జిల్లాకు చెందిన వారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని న్యూరాలజిస్టులు వెల్లడించారు.

నెలకు 10 నుంచి 15 కేసులు

న్యూరాలజీ వైద్య విభాగానికి ప్రతి నెల సగటున 10 నుంచి 15 జీబీ సిండ్రోమ్ కేసులు వస్తూనే ఉన్నాయి. ఒక్కో పేషెంట్‌కు ఖరీదైన ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తోంది. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు జీజీహెచ్‌లో 115 మంది చికిత్స పొందారు. కాగా వీరిలో 66 మందికి మాత్రమే ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు చేయడం ద్వారా వ్యాధి నుంచి కోలుకున్నారు. ఇతరులు సాధారణ వైద్యం ద్వారానే రికవరీ అయినట్లు న్యూరాలజిస్టులు చెబుతున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి మాత్రమే ఇంజక్షన్లు అవసరం వస్తుందని తెలిపారు. ఒక్కో ఇంజక్షన్ రూ. 50 వేల వరకు ఉంటుందన్నారు. బాధితుల్లో 20 శాతం మందికి మాత్రమే ఈ ఇంజక్షన్లు చేయాల్సి వస్తోందని తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో కేవలం 5 నుంచి 7.5 శాతం మంది మాత్రమే మరణించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

జీజీహెచ్‌కు వచ్చిన కేసుల సంఖ్య

నెల	బాధితుల సంఖ్య
2024 మార్చి	16
ఏప్రిల్	6
మే	11
జూన్	10
జూలై	4
ఆగస్టు	3
సెప్టెంబరు	13
అక్టోబరు	17
నవంబరు	9
డిసెంబరు	10
2025 జనవరి	11
ఫిబ్రవరి	5

ఎలా వస్తుందంటే..

వయస్సుతో సంబంధం లేకుండా.. ఆడ, మగ తేడా లేకుండా జీబీ సిండ్రోమ్ సోకుతుంది. ఇది అంటు వ్యాధి మాత్రం కాదు. 25 శాతం మందికి ఈ వ్యాధి సోకడానికి కారణాలు తెలియదు. 20 శాతం మందికి దగ్గు, జలుబు వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, రిస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్‌ల వల్ల సోకుతోంది. గ్యాస్ట్రో ఎంట్రిటీస్ (జీఈ) ఇన్‌ఫెక్షన్ వల్ల, డయేరియా వల్ల కూడా వస్తోంది. కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం వ్యాధి సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. వ్యాధి నరాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తొలుత కాళ్లకు వ్యాధి సోకి తర్వాత శరీరం పై భాగానికి ఎగబాకుతుంది. వ్యాధి నుంచి కొంత మంది గంటల వ్యవధిలోనే కోలుకోవచ్చు. మరికొంత మందికి నెలల సమయం పడుతుంది. జ్వరం, విరేచనాలు, దగ్గు, జలుబు వచ్చి తగ్గుతున్న సమయంలో వారికి కాళ్లల్లో, చేతుల్లో తిమ్మిర్లు ప్రారంభమై కాళ్లు బలహీనపడితే దీనిని జీబీ సిండ్రోమ్‌గా గుర్తించాలి. తక్షణమే చికిత్స కోసం న్యూరాలజిస్టులను సంప్రదించాలి.



'మనోరమ' సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి తదితరులు

పండితులను తీర్చిదిద్దిన సంస్కృత కళాశాల

డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

తెనాలి: చరిత్రపుటల్లో తెనాలి సంస్కృత కళాశాల చిరస్మరణీయంగా నిలిచిపోతుందని రామాయణ ప్రవచన సుధాకర, సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు అన్నారు. శతాధిక వసంతాలు నడిచిన తెనాలిలోని కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం స్థానిక రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. పూర్వవిద్యార్థులు, అధ్యాపకుల జ్ఞాపకాలతో రూపొందించిన ప్రత్యేక సంచిక 'మనోరమ'ను ఆవిష్కరించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఆగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కళాశాల భవన దాత ముదిగొండ చంద్రమౌళిశాస్త్రి ఆశయాలకు అనుగుణంగా కళాశాల ఏర్పాటై వందేళ్లకు పైగా నడిచినా తర్వాత మూతపడటం బాధాకరమన్నారు. ఎందరో గొప్ప పండితులను తీర్చిదిద్దిన కళాశాల ప్రస్తుతం ఇలా కావడం కలచి వేస్తోందన్నారు. కళాశాల చరిత్ర నిలిచి ఉండేందుకు పూర్వ విద్యార్థుల సంఘం మహాసంకల్పం చేసిందన్నారు. తిరిగి అదే కళాశాలలో సాహిత్యానికి, భాషకు సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశలో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. దాతల ఆశయానికి అనుగుణంగా విద్యను అభ్యసించి సమాజంలో గుర్తింపు పొందిన ప్రతి వ్యక్తి తిరిగి అదే కళాశాలలో మరెన్నో జ్ఞాన జ్యోతులను వెలిగించడానికి ప్రయత్నించాలని కోరారు. సంఘం కన్వీనర్ పి.వినాయకరావు, దేవయజనం మురళీకృష్ణ, ఈఎల్‌వీ అప్పారావు, చిలుమూరు రామలింగేశ్వరరావు కె.శ్రీనివాస్ శర్మ, మేడూరు శ్రీనివాసమూర్తి, ఎ.సూర్యనారాయణ, జయప్రద, ఎం.సుధారాణి, సద్యోజాతం శేష వీరేశ్వర శర్మ, ఎం.సత్యనారాయణ శాస్త్రి, లక్ష్మీనరసింహారావు, జె.అరుణ గోపాలచార్యులు, ముదిగొండ శ్రీరామ్ మాట్లాడారు. బోధనా సిబ్బంది కొందరు కాలం చేయగా, వారి కుటుంబసభ్యులను సత్కరించారు.

పూర్వజన్మ సుకృతం

కళాశాల పూర్వ విద్యార్థిని, తెలుగు సంస్కృత అకాడెమీ మాజీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ... ఈ కళాశాల తనకు భాషా పరిజ్ఞానాన్ని, సంస్కారాన్ని అందించిందని చెప్పారు. సంస్కృత కళాశాలలో చదవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఉత్తమ జ్ఞానాన్ని, నడవడికను కూడా పొందగలిగామని పేర్కొన్నారు. మూతబడిన కళాశాలను కనీసం సాహిత్యానికి సంబంధించిన ఉత్తమ గ్రంథాలయంగా రూపొందిస్తే సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అందుకు తన వంతు సహాయం అందిస్తామన్నారు.

నకిలీ నోట్ల ముఠా పట్టివేత

- గుంటూరులో అరెస్ట్ చేసి తీసుకెళ్లిన రాజమహేంద్రవరం పోలీసులు
- స్థానికులకు సంబంధాలపై విచారిస్తున్న పాతగుంటూరు పోలీసులు

పట్నంబజారు: గుంటూరులో నకిలీ నోట్లు ముద్రిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన కలకలం రేపింది. భారీగా నకిలీ నోట్లు బయటపడటంతో ఒక్కసారి పోలీసుశాఖ ఉలిక్కి పడింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీసులు శనివారం నకిలీ నోట్ల ముఠాను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. అందులో పాతగుంటూరు బాలాజీనగర్‌కు చెందిన ఇద్దరు ఉన్నారనటంతో ఇక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు. సుమారు రూ.కోటికి పైగా నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరంలో దొరికిన ఇద్దరు గుంటూరు వాసులు కాదని తేల్చారు. విశాఖపట్నం సమీపంలోని అక్కయ్యపాలేనికి చెందిన కర్రి మణికుమార్, తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన దోనేపూడి మధు నకిలీ నోట్ల ముఠాలో సభ్యులుగా ఉన్నారు. గత 15 నుంచి 20 రోజులుగా బాలాజీ నగర్ ఆరో లైనులో ఒక వృద్ధురాలి నివాసం ఖాళీగా ఉన్న క్రమంలో రూ.3 వేల అద్దె అయితే రూ.6 వేలు ఇస్తామంటూ చిన్న గదిని వారు తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం రాజమహేంద్రవరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బాలాజీనగర్‌లో ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడకు తరలించారు. మణికుమార్, మధుతోపాటు అక్కడ కొంత మందిని నిందితులను పట్టుకున్న నేపథ్యంలో తలదాచుకునేందుకు ఇక్కడకు వచ్చారా..? లేక నోట్లు మార్పిడికి సంబంధించి ఎవరినైనా కలిశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నోట్ల మార్పిడికి వచ్చి ఉంటే.. ఏదైనా మెషీన్‌లు, నోట్లు రాజమహేంద్రవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారా..? అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై పాతగుంటూరు పోలీసులకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. కేవలం వీరిద్దరే ఉన్నారా.. మరెవరైనా వచ్చారా? అనే కోణంలో పాతగుంటూరు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ చేపట్టారు. స్థానికులతో సంబంధాలపైనా ఆరా తీస్తున్నారు.

ప్రయాణికుల నేస్తమై.. భద్రతే సమస్తమై..

ఒక్క క్షణం కన్ను మరచినా.. దాని పర్యవసానం మాత్రం నిండు ప్రాణాలే. కానీ స్టీరింగ్ పట్టిన మరుక్షణం వారికి ఒకటే ధ్యాస.. తనని నమ్ముకుని వెనుక ప్రయాణికులున్నారని.. వారిని నమ్ముకుని ఎన్నో కుటుంబాలు ఉంటాయని! అలా దాదాపు 25 నుంచి 34 ఏళ్లలో ఒక్క ప్రమాదం కూడా జరగకుండా సురక్షిత డ్రైవింగ్ చేసిన వారికి ఉత్తమ పురస్కారాలను అందించి ఆర్టీసీ ప్రత్యేక గుర్తింపునిచ్చింది.

- దశాబ్దాలుగా ప్రమాదరహిత డ్రైవింగ్ చేసిన వారికి పురస్కారాలు
- అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచన



అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న డ్రైవరు (ఫైల్)

పట్నంబజారు: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రమాదరహిత కెరీర్ కొనసాగించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన డ్రైవర్‌లకు పురస్కారాలు అందజేశారు. గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలకు ముగ్గురు చొప్పున 15 మందికి వీటిని ప్రదానం చేశారు. వీరితోపాటు జిల్లా స్థాయిలో మరో ముగ్గురికి అత్యుత్తమ డ్రైవర్ పురస్కారాలను అందజేశారు. గుంటూరు జిల్లాలోని ఐదు డిపోలలో 345 బస్సులు ఉన్నాయి. 642 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యం జిల్లా వ్యాప్తంగా లక్ష మందికిపైగా ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీలో కొత్తగా నియామకాలు నిలిచిపోయాయి. వేల మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ, మెడికల్ అన్‌ఫిట్ పొందుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఉన్న డ్రైవర్లతోనే చాలాచోట్ల డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. వారికి తగిన విశ్రాంతి ఉండటం లేదు. రిటైర్డు అయిన డ్రైవర్లకు పెన్షన్ తక్కువ మొత్తంలో వస్తోంది.

పురస్కారాలు పొందిన డ్రైవర్లు వీరే...

జిల్లా స్థాయిలో ఎల్ఎస్ రావు, కేఎస్ రెడ్డి, బీఎస్ రెడ్డి పురస్కారాలు పొందారు. గుంటూరు 1 డిపో పరిధిలో ఆర్ఎస్ రావు, ఏవీ రాజు, కేవై కొండలు, గుంటూరు 2 డిపో పరిధిలో పీవీ రత్నం, జేఎల్ రెడ్డి, ఎస్ సుబ్బారావు, తెనాలి డిపో నుంచి కేవీ రెడ్డి, ఎంఎం కుమార్, బీకే అంకమ్మ, పొన్నూరు డిపోలో షేక్ జి.గౌస్, పీకే ఖాన్, జీఎస్ఎస్ రావు, మంగళగిరి డిపో నుంచి డి.యోహాన్, బీవీ రావు, కేఎస్ఎస్ రావులకు అవార్డులు అందజేశారు. వీరికి 25 నుంచి 34 సంవత్సరాల వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా డ్రైవింగ్ చేసిన రికార్డు ఉంది.

ప్రయాణికులదీ మా కుటుంబమే



బస్సులో ఎక్కిన ప్రతి ప్రయాణికుడు మా కుటుంబ సభ్యుడే. కచ్చితంగా సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పాటుపడతాం. చిన్న తప్పిదాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు కూడా పూర్తిస్థాయిలో సహకరించటం ద్వారానే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చు. ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక కావటం సంతోషంగా ఉంది.

– పీవీ రత్నం, డ్రైవర్

30 ఏళ్లకుపైగా సర్వీసు



నా సర్వీసు 30 సంవత్సరాల పైనే ఉంది. ఇన్నేళ్లలో ఒక్క ప్రమాదానికి కూడా ఆస్కారం లేకుండా డ్రైవింగ్ చేశా. ప్రాణం విలువ ఏంటో నాకు బాగా తెలుసు. ఒక చిన్న ప్రమాదం కుటుంబాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది. అందుకే ఎంతో బాధ్యతగా, జాగ్రత్తగా బస్సు నడుపుతా. అధికారుల మన్ననలు పొందటం సంతోషంగా ఉంది.

– జేఎల్ రెడ్డి, డ్రైవర్

ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి



సుదీర్ఘ కాలం అనుభవంతో కూడిన డ్రైవింగ్ చేస్తూ ఒక్క ప్రమాదానికి కూడా చోటివ్వని సీనియర్ డ్రైవర్లను ఇతరులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలను అప్పుడే అందించగలం. ఇలా డ్రైవింగ్ విధులు నిర్వర్తించటమంటే మామూలు విషయం కాదు. పైగా ట్రాఫిక్‌లో డ్రైవర్‌లకు ఉండే టెన్షన్ అంతా ఇంతా కాదు. మేం కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని విధుల్లో బాధ్యతగా ముందుకు సాగుతాం.

– ఎం. రవికాంత్, ఆర్ఎం, ఆర్టీసీ

బంగారం దోపిడీపై ఎన్నో అనుమానాలు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు సాయిబాబా ఆలయం వద్ద శనివారం రాత్రి జరిగిన బంగారం దోపిడీపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. పట్టణంలోని కొప్పురావు కాలనీకి చెందిన దివి నాగరాజు విజయవాడలో డీవీఆర్ గోల్డ్ షాపు నడుపుతున్నారు. శనివారం రాత్రి సుమారు 5 కేజీల బంగారాన్ని తన వద్ద పని చేసే యువకుడితో మంగళగిరి ఇంటికి పంపారు. యువకుడు ఆత్మకూరు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కొందరు దుండగులు అడ్డగించి బంగారం దోచుకుని పారిపోయారని నాగరాజు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు.

వాస్తవాలు తేల్చే పనిలో పోలీసులు

ఈ ఘటనపై పలు అనుమానాలు రావడంతో పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. నాగరాజు అప్పుల బాధ తట్టుకోలేక గతంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మూడు నెలల క్రితం నాగరాజు సతీమణి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నాగరాజు అప్పుల్లో కూరుకుపోయి వాటి నుంచి బయటపడేందుకు బంగారం దోపిడీ నాటకం ఆడారా? అనే కోణంలో విచారిస్తున్నారు. బంగారం తీసుకెళ్లిన యువకుడిని పోలీసులు విచారిస్తుండగా... నాగరాజు సోదరుడు దివి రవి వచ్చి అతడు చాలా నమ్మకస్తుడని చెప్పారు. అతడిని విచారించవద్దని పోలీసులతో పేర్కొనడం గమనార్హం. ఆత్మకూరు జంక్షన్‌లో సంఘటన జరిగినట్లు చెబుతున్న సమయం రాత్రి 7.30 నుంచి 10.30 గంటల వరకు సీసీ టీవీ ఫుటేజీలో దీనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు చెబుతున్నారు. బంగారం తరలించిన యువకుడి వాహనం సైతం ఫుటేజీలో లేకపోవడంతో పోలీసుల అనుమానం బలపడుతోంది. ఇప్పటికే పది మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడలోని దుకాణానికి తీసుకెళ్లి విచారించారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి 'కళా కిరీటి' అవార్డు

తెనాలి: రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ కళా కిరీటి జాతీయ పురస్కారాన్ని అందజేసింది. ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవ సందర్భంగా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ అవార్డు అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా పాలకొల్లు పరిధిలోని మలికిపురంలో ఆదివారం కళా కిరీటి జాతీయ పురస్కారాలను బహూకరించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు చొప్పర శ్రీనివాస్, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, గోకా వెంకట్రావ్, నరసింహమూర్తి తదితరులు డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారిని ఘనంగా సత్కరించారు.



అవార్డు అందుకుంటున్న ప్రజ్ఞాచారి

విశ్వకర్మను పూజిస్తే సకల శుభాలు

తెనాలి: శ్రీవిరాట్ విశ్వకర్మను పూజించటం వల్ల సకల శుభాలు కలుగుతాయని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) అన్నారు. పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా తెనాలి వచ్చిన ప్రజ్ఞానంద సరస్వతి రెండోరోజైన ఆదివారం స్థానిక కొత్తపేటలోని శ్రీవిరాట్ విశ్వకర్మ దేవస్థానానికి విచ్చేశారు. విశ్వకర్మకు, కామాక్షి అమ్మవారికి, దాసాంజనేయస్వామికి హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రవచించారు. శ్రీవిరాట్ విశ్వకర్మ దేవాలయంలో ఆరికట్ల వెంకటేశ్వరరావు అర్చకత్వం చేసినరోజుల్లో తాను వారి శిష్యరికంలో పూజాకార్యక్రమాలు నిర్వహించినట్టు గుర్తు చేసుకున్నారు. వెంకటేశ్వరరావు కాలం చేశాక, తాను అర్చకత్వ బాధ్యతను స్వీకరించి కొంత కాలం ఆ బాధ్యతలను నిర్వర్తించానని చెప్పారు. ఆ కారణంగానే శ్రీవిరాట్ విశ్వకర్మ, కామాక్షి అమ్మవారి అనుగ్రహం పొందటానికి ఆలయానికి వచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో దేవాలయం ఈవో ఎస్‌వీఎస్ మల్లేశ్వరి, అర్చకుడు టీవీఎల్ కాంతారావు, కమిటీ సభ్యులు తాళాబత్తుని ఉదయశంకర్, మానేపల్లి జేజిబాబు, జి.సాయి, లక్ష్మీపతి, జి.అర్జున్, సాయి ఈశ్వరశర్మ, కె.నరేంద్ర, ముద్దాభక్తుని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

తెనాలి: త్వరలో రానున్న బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎన్నికల్లో బీసీ సబ్‌ప్లాన్‌తో ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఈ మేరకు బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కేటాయించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు గతంలో మాదిరిగా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పింఛను ఇస్తామన్న హామీని నిలుపుకోవాలని కోరారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారుల దాడులు



గుంటూరు రూరల్: నగర శివారుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలపై ఆదివారం మైనింగ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు అధికారులు, జిల్లా మైనింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. గుంటూరు వెస్ట్ మండలం చౌడవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 104లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లుగా వచ్చిన ఫిర్యాదుపై తనిఖీలు చేశారు. పుప్పాల గోపీకృష్ణ అలియాస్ ఆడిటర్ గోపీకృష్ణ అక్రమంగా మైనింగ్‌కి పాల్పడుతున్నట్లు గుర్తించారు. మట్టి తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి నల్లపాడు పోలీసులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పిడుగురాళ్ల ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మసీదు ఎదురు సిమెంట్ బెంచీ మీద గుర్తు తెలియని సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తించామన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బ్యాంకు అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులే పునాదిరాళ్లు

యూబీఐ జోనల్ హెడ్ సయ్యద్ జవహర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జవహర్

కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారులు, పారిశ్రామికవేత్తల సహకారంతో వ్యాపారపరంగా అత్యున్నత శిఖరాలు చేరుకున్న బ్యాంకుల అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు, అధికారులు పునాదిరాళ్లని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) జోనల్ హెడ్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్‌లో భాగమైన 'యూనియన్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్ (ఏపీ, తెలంగాణ)' మూడేళ్లకు ఒకసారి జరుపుకునే సదస్సును ఆదివారం సాయంత్రం బ్రాడీపేట పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల వెంకయ్య మాట్లాడుతూ ఐదు లక్షల కోట్ల రూపాయల పైగా టర్నవర్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ అభివృద్ధిలో లక్షలాది మంది ఉద్యోగులు, అధికారుల శ్రమ ఉందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల ప్రధాన సమస్యలైన 1995 నుంచి పెన్షన్ అప్డేషన్‌తో పాటు మెడికల్ అలవెన్సులపై జీఎస్టీ 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలని కోరారు. అన్ని ప్రధాన సమస్యలపై ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ మేనేజ్‌మెంటు నేరుగా విశ్రాంత ఉద్యోగులతోనే చర్చించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూబీఐ జోనల్ హెడ్ జవహర్ ఫర్జాన్ దంపతులను, రెండు రాష్ట్రాల నాయకులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో విశ్రాంత యూబీఐ విశ్రాంత జోనల్ అధికారులు టి.ఎల్.వి. రావు, డాక్టర్ కొసరాజు రవీంద్రనాథ్, పుల్లారావు, నాయకులు కొండలరావు, యల్లారావు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. రమణ, హరిబాబు, శ్యామ్, కె. శ్రీనివాసరావు, సుబ్బారావు, లలిత అన్నపూర్ణ పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కార్యవర్గం

గౌరవాధ్యక్షుడిగా పీబీ రాఘవేంద్రరావు, అధ్యక్షుడిగా ఎ.వెంకయ్య, ఉపాధ్యక్షులుగా టి.వసంతా దేవి, పీసీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా ఎస్.ఆర్.ఎస్. శ్యామ్, షేక్ అన్వర్ ఖాసిం, కోశాధికారిగా లలిత అన్నపూర్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా డాక్టర్స్ క్రికెట్ పోటీలు

పెదకాకాని: డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. నంబూరులోని డీఎస్‌ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల పోటీల్లో వైద్యులు పాల్గొని ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ వైద్య వృత్తిలో నిత్యం ఒత్తిడి, ఆందోళన ఉంటాయని, వాటిని తట్టుకునేందుకు క్రీడా పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. పోటీల్లో బ్రిందా బ్రెయిన్ – ఎ 1 ఎవన్‌జర్స్, ఐకాన్–జీబీఆర్, టైమ్ పాస్ టిల్లు – శ్రీ టీమ్‌లు పోటీ పడ్డాయి. ఎ1 ఎవన్‌జర్స్, జీబీఆర్, శ్రీ టీమ్ విజేతలుగా నిలిచాయి. ఫైనల్స్‌కు చేరిన శ్రీటీమ్ అమృత టీమ్‌తో పోటీపడగా శ్రీటీమ్ విజయం సాధించింది. టీమ్‌లో మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా నిమ్మకాయల పృథ్వీరాజ్, బెస్ట్ బౌలర్‌గా పృథ్వి ట్రోఫీలను అందుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీరింగ్ ఆఫ్ పోలవరం ప్రాజెక్ట్ జి. శివకుమార్‌రెడ్డి, డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.ఎస్. రెడ్డి, డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు, వైద్యులు దావులూరి రమేష్, సందీప్ వెల్లా, దాట్ల శ్రీనివాసరెడ్డి, జాన్ షహిద్, ఎండీ. అస్లం, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ నాగూర్‌బాషా

డాక్టర్ నాగూర్‌బాషాకు బెస్ట్ బ్యాట్స్ మేన్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా క్రికెట్ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మేన్ అవార్డును ఆదివారం అందుకున్నారు. డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి నంబూరులోని డీఎస్‌ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వైద్యుల క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. లీగ్ మ్యాచ్‌లలో 53 బంతులకు 46 రన్స్ చేసి బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపినందుకు డాక్టర్ నాగూర్‌బాషాకు బెస్ట్ బ్యాట్స్‌మేన్ అవార్డు లభించింది.

ముగిసిన నాటిక పోటీలు



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం నాటిక పోటీలను మద్ది లక్ష్మీశ్వేతా కిషోర్ జ్యోతి ప్రజ్వలన నిర్వహించి ప్రారంభించారు. కాకినాడ జి.వి.కె.క్రియేషన్స్ వారి తితిక్ష, గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటికలు ప్రదర్శించారు. మాదక ద్రవ్యాలు సమాజాన్ని నాశనం చేస్తుంటే గంజాయి సరఫరా చేసే కన్న కొడుకునే కడతేర్చి గంజాయి భూతాన్ని తరిమికొట్టాలనే కన్నతల్లి ప్రయత్నమే కథాంశంగా తితిక్ష నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. డబ్బు సంపాదనే లక్ష్యంగా మారి వైద్యాన్ని అమ్ముకుంటున్న డాక్టర్ తన తప్పు తెలుసుకొని పేదలకు వైద్యం అందించేందుకు గ్రామ బాట పట్టడం ఇతివృత్తంగా చిగురు మేఘం ప్రేక్షకుల మన్ననలు పొందింది. కాగా, శనివారం రాత్రి నాటిక పోటీలకు హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, నాటక రంగాన్ని భావి తరాలకు అందించాలని కళాకారులను కోరారు.

వారమే సమయం.. నత్తే నయం

తిరునాళ్ల పనుల్లో కనిపించని పురోగతి

- 23 నుంచి కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం
- కొండ దిగువున పనులు ప్రారంభించని పలు శాఖలు
- ఏర్పాట్లలో ప్రధాన శాఖల నిర్లక్ష్య వైఖరి
- ఆలయంలోనూ కొనసా..గుతున్న పనులు



కోటప్పకొండ ఆలయ ప్రాంగణంలో ఇంకా కొలిక్కిరాని పనులు



పిచ్చిమొక్కలతో నిండిన కొండ దిగువున స్టాల్స్, తాత్కాలిక వసతి ఏర్పాటు ప్రాంతం

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 26వ తేదీన కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్ల మహత్సవానికి వారం రోజులే సమయం ఉంది. ఏకాదశి ముందురోజు ఆదివారం కావడంతో ఈనెల 23 నుంచే కోటప్పకొండకు భక్తుల రాక ప్రారంభమవుతుంది. తిరునాళ్ల ఏర్పాట్లపై నెలరోజుల నుంచి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా కీలకమైన శాఖలు ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ఆలయ ప్రాంగణంలో రంగులు వేసే పనే ఇంకా ఒక కొలిక్కి రాలేదు. కొండ దిగువున బారికేడింగ్, లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి పనులపై అధికారులు ఇప్పటివరకు దృష్టిపెట్టలేదు. కొండకు వచ్చే రహదారుల్లో మరమ్మతులు ఇప్పటివరకు ప్రారంభించలేదు.

దగ్గర పడుతున్నా చలనం ఏదీ..?

కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది యాత్రికుల కోసం ప్రభుత్వ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇందుకోసం నెలరోజుల నుంచే జిల్లా అధికారులతో పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. అయితే తిరునాళ్లకు సమయం దగ్గర పడుతున్నా పలు శాఖల్లో చలనం కనిపించడం లేదు. కొండ దిగువున శివరాత్రి రోజు రాత్రి జాతరకే లక్షలాది మంది తరలివస్తారు. ఈ ప్రాంతంలో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాల్సి ఉంది. కొండ దిగువన ప్రధాన రహదారి వెంట బారికేడ్లు ఏర్పాటు చేసే పనిని ఆర్‌అండ్‌బీ నిర్వహించాల్సి ఉంది. ఈ పనులు ఇంకా ప్రారంభించలేదు. ప్రధాన రహదారులతో పాటు భక్తులు స్నానాలు ఆచరించే చిలకలూరిపేట మేజర్ కాలువ వద్ద విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలి, ఆర్‌అండ్‌బీ (ఎలక్ట్రికల్) శాఖ దీనిని చేపటాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు. యాత్రికులకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటి కుళాయిలు ఏర్పాటుతో తాత్కాలిక మరుగుదొడ్లను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్వహిస్తోంది. ఆయా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖల స్టాల్స్, పోలీసు ఉన్నతాధికారుల తాత్కాలిక వసతి కోసం సిద్ధం చేసే మైదానాన్ని ఇప్పటివరకు శుభ్రం చేయకపోవడంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

రహదారుల పరిస్థితి ఇంతేనా..?



అధ్వానంగా చిలకలూరిపేట మేజర్ కేనాల్ రోడ్డు

కొండకు చేరే ప్రధాన రహదారులతో పాటు లింక్‌రోడ్లను తిరునాళ్ల కోసం సిద్ధం చేయాల్సి ఉండగా ఆ పనులను ఇప్పటి వరకు చేపట్టలేదు. కోటప్పకొండ – కొత్తపాలెం రహదారి మెటల్ బయటపడి అధ్వానంగా ఉంది. కోటప్పకొండ నుంచి పెట్లూరివారిపాలెం కాలువ రహదారి గోతుల మయంగా మారింది. అలాగే గురవాయపాలెం – ఉప్పలపాడు రోడ్డు గోతులతో నిండిపోయింది. తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రధానంగా రోడ్లు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆలయ ప్రాంగణంలో పరిస్థితి

కొండ మీద ప్రధానాలయం కాకుండా ఇతర ఆలయాలకు రంగులు వేసే పనిని నెల రోజుల క్రితం ప్రారంభించారు. ఈ పనులు ఇంకా సాగుతున్నాయి. క్యూలైన్‌లకు మరమ్మతులు చేపట్టి రంగులు వేయడం పూర్తయింది. ఆలయ ప్రాంగణంలోని ఆర్చీకి రంగులు వేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఉన్న క్యూలైన్‌లకు తాటాకు పందిరి ఏర్పాటు చేస్తున్నారు.

20వ తేదీకి ఆలయంలో పనులు పూర్తి

ఈనెల 23వ తేదీ ఆదివారం నుంచే భక్తుల తాకిడి ఉంటుందని భావిస్తున్నాం. అందుకు తగ్గట్టు ఆలయంలో చేపట్టిన పనులు 20వ తేదీకి పూర్తిచేయాలని నిర్ణయించాం. రంగులు వేసే పని మూడు రోజుల్లో పూర్తవుతుంది. ప్రసాదాలు తయారీని ప్రారంభించాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డి.చంద్రశేఖరరావు, ఆలయ ఈఓ

పండ్ల వ్యాపారి హత్య



రబ్బాని మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు, ప్రకాశరావు

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పండ్ల వ్యాపారి హత్యకు గురైన ఘటన ఆదివారం సాయంత్రం తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన షేక్ రబ్బాని(36) చెంచుపేట డొంక రోడ్డు వద్ద పండ్లు విక్రయిస్తుంటాడు. అతడి మేనకోడలు కరీమాను పినపాడుకు చెందిన షేక్ గౌస్‌బాజీకి వచ్చి వివాహం చేశారు. దంపతుల మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో మేనకోడలికి రబ్బాని మద్దతుగా నిలుస్తున్నాడు. ఇది మనసులో పెట్టుకున్న గౌస్‌బాజీ రబ్బానీని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం సాయంత్రం కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు అతన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కొలకలూరు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడివాడకు చెందిన బొద్దులూరి పద్మావతి(53) ఒంగోలులో బంధువుల వివాహానికి వెళ్లేందుకు సోదరితో కలసి కొలకలూరు రైల్వేస్టేషన్‌కు వచ్చింది. టికెట్ తీసుకుని ఒకటో నంబరు ప్లాట్‌ఫాం దిగి పట్టాలు దాటుతుండగా, విజయవాడ నుంచి చెన్నై వైపు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పొగ మంచు కారణంగా రైలు కనబడకపోవడంతో ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని తెనాలి జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలి మృతి



కమల మృతదేహం

పట్నంబజారు: ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాభిపురం 2వ లైనులోని సాయి సునంద టవర్స్‌లో నివసించే దంటు కమల (70) ఆదివారం పాల ప్యాకెట్ తీసుకునేందుకు రోడ్డు మీదకు వచ్చింది. పట్టాభిపురం ప్రధాన రహదారిలో పెట్రోల్ కొట్టించుకుని రోడ్డుపై వస్తున్న సెప్టిక్ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె మరిది కృష్ణప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన అంకాల ప్రత్యూష (23) ఏడాది కిందట ఆనందపేటకు చెందిన అంకాల పవన్ కల్యాణ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ప్రత్యూష కన్సల్టెన్సీలో ఉద్యోగం చేస్తుంది. పవన్ కల్యాణ్ మార్కెట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం అలవాటు ఉన్న కల్యాణ్‌తో మృతురాలు ప్రత్యూషకు తరచూ వివాదం జరుగుతుండేది. ఈనెల 15 రాత్రి పవన్ తాగి వచ్చి భార్యతో ఘర్షణ పడ్డాడు. అతడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రత్యూష్ ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతురాలి తల్లి కుమార్తె మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల మధ్య ఘర్షణ

పట్నంబజారు: ఘర్షణలో ఒక వర్గంపై మరో వర్గం కర్రలు, సర్జికల్ బ్లేడ్‌లతో దాడిచేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్ జీరో లైనులో నివాసం ఉండే గద్దె శివకేశవ, అఖిల్ మధ్య కొంతకాలంగా ప్లెక్సీలకు సంబంధించి వివాదం ఉంది. శివకేశవ, అఖిల్‌లు రెండు వర్గాలుగా విడిపోయి పలుమార్లు ఘర్షణ పడిన పరిస్థితులున్నాయి. ఆదివారం సాయంత్రం శివకేశవ, మణికంఠ, వాసులు కాకాని రోడ్డులోని వాసవీ క్లాత్ మార్కెట్ వద్ద నిలబడి ఉన్నారు. ఈ సమయంలో అఖిల్, పండు, నారాయణ, దయాకర్, మధుతో పాటు మరో ఎనిమిది మంది వారిపై దాడిచేసి కర్రలతో కొట్టి, విచక్షణరహితంగా సర్జికల్ బ్లేడ్‌లతో దాడికి పాల్పడ్డారు. శివకేశవ, మణికంఠలకు గాయాలయ్యాయి. ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి కౌలురైతు మృతి



లింగయ్య(ఫైల్)

ఫిరంగిపురం: పురుగు మందు తాగి కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కండ్రికలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తుపాకుల లింగయ్య(41) పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాడు. ఈ ఏడాది కూడా మూడు ఎకరాల మిర్చి, నాలుగు ఎకరాల పత్తి, ఎకరన్నర మాగాణి వేశాడు. మిర్చికి సరైన ధర లేకపోవడం, పత్తి దిగుబడి సరిగారాకపోవడంతో బాధపడుతున్నాడు. ఇప్పటికే సుమారు రూ.15లక్షల వరకు అప్పులు ఉండటంతో తీవ్రంగా మనస్తాపం చెందుతున్నాడు. దీంతో శనివారం సాయంత్రం వేమవరం వెళ్లే దారిలోని పొలం సమీపంలో పురుగుమందు తాగి పడిపోయాడు. గమనించిన గొర్రెల కాపరులు గ్రామస్తులకు తెలియజేయడంతో బంధువులు వచ్చి లింగయ్యను చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి ఆదివారం పోస్టుమార్టం చేయించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ హ్యాండ్ బ్యాగ్ చోరీ

లక్ష్మీపురం: మహిళ హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గోరంట్ల గ్రామానికి చెందిన సాయి పూజ ఈనెల 14న అరండల్‌పేట 5/5లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వచ్చింది. పలు పరీక్షలు చేయించుకునే క్రమంలో మెడలో ఉన్న 20 గ్రాముల బంగారు గొలుసును బ్యాగ్‌లో పెట్టుకుంది. రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి వచ్చింది. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కొని పరారైయ్యారు. దీంతో పూజ కేకలు పెట్టడంతో స్థానికులు పట్టుకునే యత్నం చేసేలోగా పరారైయ్యారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాగ్‌లో ఉన్న 20 గ్రాముల బంగారు గొలుసు, రూ.15వందల నగదు, సెల్‌ఫోన్ ఉన్నట్లు బాధితురాలు తెరుకుని శనివారం రాత్రి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విక్రయాలు బక్క చిక్కెన్!

- బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ దుకాలు వెలవెల
- మటన్, చేపలు, రొయ్యలవైపునకు మళ్లిన మాంసం ప్రియులు



వినుకొండ రోడ్డులోని వినియోగదారులు లేక వెలవెలబోతున్న ఓ చికెన్ దుకాణం

నరసరావుపేట: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధితో లక్షలాది కోళ్ల చనిపోవడం, ఆయా జిల్లాల్లో చికెన్, గుడ్ల విక్రయాలు నిలిపేయడం, జనంలో నెలకొన్న భయాందోళనలు వెరసి వీటన్నిటి ప్రభావం జిల్లాలోని చికెన్ విక్రయాలపై పడింది. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని, 100 డిగ్రీల మంటపై వండిన చికెన్‌ను తినవచ్చని పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రకటించినా ప్రజలు పట్టించుకోలేదు. ఈ ఆదివారం కొద్ది బేరం తప్పితే చికెన్‌షాపులు అన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే మటన్, చేపలు, రొయ్యలు విక్రయించే దుకాణాలు మాంసం ప్రియులతో కిటకిటలాడాయి. పట్టణ పరిధిలోని వినుకొండ రోడ్డు, కలెక్టరేట్ రోడ్డు, పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, గుంటూరు రోడ్డు, మాంసం మార్కెట్, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చికెన్ దుకాణాలు వెలవెలబోవగా, ఆ పక్కనే ఉన్న మటన్ దుకాణాలు, మినీ వ్యాన్‌లలో చేపలు విక్రయించే మినీ వ్యాన్‌ల వద్ద జనం రద్దీ కనిపించింది. ప్రజల్లో బర్డ్‌ఫ్లూ భయాందోళనలు నెలకొన్నా.. చికెన్ ధరలు స్వల్పంగానే తగ్గడం గమనార్హం. గత ఆదివారం కేజీ రూ.260కు విక్రయించిన వ్యాపారులు ఈ ఆదివారం స్కిన్‌తో రూ.220, స్కిన్‌లెస్ రూ.240లని బోర్డులు వేలాడ దీశారు. మటన్ కేజీ రూ.900లకు విక్రయించగా, చేపలు రాగండి కిలో రూ.180, బొచ్చె రూ.220, కొరమేను రూ.500కు విక్రయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పట్నంబజారు: ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన చింతా రాము (19) కొత్తపేటలోని కుగ్లర్ ఆసుపత్రి వద్ద నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో ఒక ప్రైవేటు ల్యాబ్‌లో డెలివరీ బోయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అరండల్‌పేటలో పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. అతి వేగంగా ప్రయాణిస్తుండటంతో డివైడర్‌పై ఉన్న ఇనుప చువ్వలపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు బాబూరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటీ పాటల పేరుతో రూ.15లక్షలు మోసం

లక్ష్మీపురం: చీటీ పాటల పేరుతో నగదు వసూలు చేసుకుని తిరిగి ఇవ్వకుండా పారిపోయిన నిర్వాహకులపై అరండల్‌పేట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాలకొండయ్య కాలనీకి చెందిన విజయలక్ష్మి, ఆమె కుమారుడు అనిల్ చీటీ పాటలు వేస్తుంటారు. తల్లీకొడుకులు ఇద్దరు ఆ ప్రాంతంలో 40 మంది నుంచి రూ.15లక్షలు వసూలు చేసి, ఎవరికీ చెప్పా పెట్టకుండా పారిపోయారు. దీంతో బాధితులు దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.